# Contents (విషయ సూచిక)


| | | | |
|---|---|---|---|
| 1. | ఆధునిక తెలుగు కవిత్వం - ప్రపంచీకరణ పర్యవసానాలు | - డా॥. ఎన్. ఈశ్వరరెడ్డి | 25 |
| 2. | నూతలపాటి కవిత్వం - సమకాలీనత | - డా॥. పి. సి. వెంకటేశ్వర్లు | 31 |
| 3. | నాకొక మనిషి కావాలి | - డా॥. పల్లా కృష్ణ | 38 |
| 4. | బ్రహ్మర్షి ఉమర్ ఆలీషా గారి సాహిత్యం - సామాజిక సందేశం | - డా॥. పైడిపాటి ఉమానాథ శర్మ | 43 |
| 5. | తిలక్ మానవతావాద కవిత 'ఆర్తగీతం' | - కటుకం శారద | 48 |
| 6. | ఆధునిక కవుల రచనల్లో సమకాలీన సమస్యల చిత్రణ | - డా॥. తరపట్ల సత్యనారాయణ | 52 |
| 7. | అభ్యుదయ కవిత్వంలో శ్రీశ్రీ మహాప్రస్థానం-సామాజిక చైతన్యం | - మార్తల పవన్ కుమార్ రెడ్డి | 57 |
| 8. | ఆధునిక కవిత్వం - బీ. సీ. రాజకీయ చైతన్యం | - ఎం. మలెంకొండయ్య | 60 |
| 9. | భండారు సదాశివరావు "అగ్నిమూర్తులు" కవితా సంహిత .. | - యాదగిరి | 64 |
| 10. | సమకాలీన సమస్యలకు దర్పణం - అనిసెట్టి సుబ్బారావు కవిత్వం | - డా॥. పి. విజయకుమార్ | 71 |
| 11. | దాశరథి సాహిత్యం తెలంగాణ ఉద్యమ చైతన్యం | - కాపర్తి స్వరాజ్యం | 74 |
| 12. | కృష్ణ శాస్త్రి కవిత్వం- ఆత్మావలోకన దిశగా సమస్యా సాధనత్వం | - డా॥. జాడ సీతాపతి రావు | 79 |
| 13. | 'దృశ్య ప్రవాహం' కవితా సంపుటి - సమకాలిన సమస్యలు | - యం. శోభారాణి | 83 |
| 14. | దుక్కిచూపు కవిత్వం (దీర్ఘకవిత) - సామాజిక చిత్రణ | - ఎస్. గంగాధరరెడ్డి | 86 |
| 15. | డా॥. సినారె విశ్వంభర ఒక పరిశీలన | - డా॥. కొమ్మిశెట్టి మోహన్ | 90 |
| 16. | ఆధునిక కవిత్వంలో గురజాడ పాత్ర - సామాజిక సేవ | - మోపూరు భైరవేశ్వర | 95 |
| 17. | జాషువా "ఫిరదౌసి" - సామాజిక సమస్య | - ఓబిలి వెంకటయ్య | 98 |
| 18. | వచనకవితా సారథి కుందుర్తి - నగరంలో వాన | - డా॥. వి. శివనాగార్జున రెడ్డి | 102 |
| 19. | ఆధునిక కాలంలో జాషువా రచనల అవసరం | - డా॥. లక్ష్మయ్య | 106 |
| 20. | కాళోజీ కవిత్వం మానవత్వపు విలువలు | - డా॥. బూర్గుల స్వరూప | 109 |
| 21. | శ్రీ.శ్రీ. - మహాప్రస్థానం - కవిత్వ పరిశీలన | - కొత్తకోట శ్రీనివాసరావు | 111 |
| 22. | సామాజిక సమస్యల దర్పణం - ప్రసాదమూర్తి కవిత్వం | - భమిడిపాటి గౌరీశంకర్ | 115 |
| 23. | గోరేటి వెంకన్న పాటలు - సమకాలీనత | - రాఘవేంద్రరావు | 117 |
| 24. | దళిత, ముస్లిం మైనారిటీ కవిత్వాన సామాజిక సమస్యలు | - కె. అనిల్ బాబు | 121 |
| 25. | సుబ్బారావు పాణిగ్రహి కవిత్వం - సమకాలీన సమస్యలు | - డా॥. జి. పార్వతి & - బి. రాజశేఖర్ | 126 |

# సమాజ పరివర్తన లక్ష్యంగా సాగిన డా॥. ఎన్. ఈశ్వరరెడ్డి గారి
# 'నాకొక మనిషి కావాలి'

– డా॥. పల్లె కృష్ణ, తెలుగు అధ్యాకులు, సి.యస్.యస్.ఆర్ & యస్.ఆర్.ఆర్.యమ్ డిగ్రీ & పిజి కళాశాల, కమలాపురం.

సామాన్యమైన మట్టిని ఆకాశం దాకా పెంచిన విశ్వ మానవుడు తెలుగు కవి. తన కాలంలో ఆయా సందర్భాలలో వచ్చే మార్పులకు అనుగుణంగా కాలంతో పాటు, ఒక్కోసారి కాలానికి అతీతంగా పయనించేవాడే కవి. సమకాలీన సమాజంలో పుట్టి, సమాజం చేత ప్రభావితమై, సమకాలీన సమాజాన్ని ప్రభావితం చేసే అంశాలలో కవిత్వం ఒకటి.

నేటి మానవుని జీవనం నడకేలేని పరుగై, ఈ వేగం కవితలోకి చొరబడి, ఫలితంగా ఆధునిక వచనకవిత్వం సామాజిక స్పృహతో సమకాలీన అంశాలతో ప్రబలమైన అనుభూతులతో అనేక రూపాల్లో వెలువడుతోందనవచ్చు. మనచుట్టూ ఉన్న ఆనుభవిక ప్రపంచాన్ని ఆవిష్కరించడమే కవిత్వలక్ష్యం. అదొక సామాజిక చైతన్యం.

ఆధునిక సమాజంలో ప్రస్తుతం చూస్తున్న ప్రజా సమస్యలపై తమదైన శైలిలో 'నాకొక మనిషి కావాలి' అంటూ గళమెత్తిన ఆధునిక భావజాలాన్ని అంత:సూత్రంగా తమ కవితల్లో పయనింపచేసిన మానవతావాది, కవి, గాయకుడు, రచయిత డా.ఎన్.ఈశ్వరరెడ్డిగారి కవిత్వ పరిశీలన ఈ పత్రం ముఖ్య ఉద్దేశ్యం.

ఈ కవితా సంపుటిలో ఎన్నో భిన్న సామాజిక వాస్తవ కోణాలు దాగి వున్నాయి. 43 కవితలు గల ఈ కవితా సంపుటిలో - "కవిత్వం ఒక జీవరసం" మొదలుకొని "నిరాశ పడకు నేస్తమా" వరకు వున్న కవితల్లో సమకాలీన సామాజిక అస్థిరత్వాన్ని స్పష్టపరుస్తూ కవి తన మానవీయ దృక్పథాన్ని ఆవిష్కరించడం జరిగింది. ఏ కాలంలోనైనా కవి ఎప్పుడూ ప్రజల పక్షపాతి. తమ కాలంలోని సమాజ గతి, ప్రజల స్థితిగతులను పరిశీలించడం ప్రశ్నించడం, మార్పుకు తనదైన మార్క్ చూపించడం జరుగుతుంది. కవి అంతరంగంలో మెదిలే భావాల పరంపరకు అప్పుడే సార్థకత చేకూరుతుందని చెప్పవచ్చు. మారుతున్న కాలాన్ని అనుసరించి సమకాలీన సామాజిక వాస్తవ ప్రపంచాన్ని ఈశ్వర రెడ్డి గారు విస్తృత అనుభవంతో దర్శించి సమాజ పరివర్తన లక్ష్యంగా మనకు ఈ కవితా సంపుటిని తమదైన శైలిలో మనకు అందించారని చెప్పవచ్చు.

'కవిత్వం ఒక జీవరసం' అనే ఈ కవిత కవి తాను నమ్మిన, అనుసరిస్తున్న ప్రపంచంతో మమేకమై కవిత్వాన్ని రాయడం జరిగింది. తనను అమితంగా మార్చిన మరియు నడిపిస్తున్న కవిత్వానికి ఉన్నత స్థాయి కలదని ప్రకటించినట్లుగా తెలుస్తుంది.

మమతల్లో ముంచిన
నాలుగు అక్షరాలు చల్లితే
బండబారిన గుండెలు
లే చివుళ్లయి లేస్తాయి

కవిత్వం ఒక ప్రాణం ... అంటూ కవిత్వం యొక్క మాధుర్యాన్ని వివరిస్తారు.

నాలుగు పదాలకు - ఒక స్వర గజ్జ కడితే
జన సముద్రం పోటెత్తుతుంది - కవిత్వం ఒక రక్త చైతన్యం ... అంటూ విప్లవ స్ఫూర్తిని, అది రగిల్చే శక్తిని ఆవిష్కరించారు.

ఇలా కవిత్వానికి ఉన్న శక్తిని పరిచయం చేసే కవిత్వంలో తారా స్థాయికి ఎదిగిన పురస్కార గ్రహీతల గురించి పరిచయం చేస్తూ "కవిత్వం ఒక గొప్ప మహత్యం కలదని" అంటూ తన జీవితాన్ని మార్చిన నవనీతంగా భావిస్తారు. మనిషి ఎంత ఎత్తుకు ఎదిగినా తన కాళ్లు ఉండాల్సింది భూమిపైనే అని అది మరువకూడదని పెద్దలు ఏనాడో తమ జీవిత అనుభవసారాన్ని ప్రపంచానికి

అందించారు. కానీ మనిషి తనకు తాను గుణపాఠం నేర్చుకుంటే తప్ప ఆ సత్యాన్ని గ్రహించలేకపోతున్నాడు. అదే విధంగా తన ఆలోచన పరిధిని అనూహ్యంగా కుచించుకుపోయిన ఆలోచనలతో తాను చేసే తప్పులకు జాతిని బలి కావించడం జరుగుతోంది.

మనిషి తనకు తాను ఒక గుదిబండను తగిలించుకొని తాను నడుస్తున్న చీకటిలోనే తన జాతిని నడిపించే ప్రయత్నం చేస్తున్నాడు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఎంత పరిణతి చెందిన అది కేవలం వస్తు ప్రపంచానికే పరిమితం అన్నట్లు ప్రవర్తిస్తున్నాడు అని కవి ఈశ్వర రెడ్డి గారు మదన పడుతున్నారని భావించవచ్చు. 'మత మౌఢ్య రేఖ' అనే కవితలో హింస కేంద్రకం చుట్టూ మత మౌఢ్య రేఖ పరుగులు పెడుతున్నదని దేశాలకు దేశాలే ఈ విష వలయంలో చిక్కుకుని మానవ విధ్వంసం జరుగుతోందని వాపోయారు. ముందుగానే అనుకున్నట్లు కవిగారు సమకాలీన సమాజాన్ని తమ జీవిత అనుభవంతో కాచి వడపోసినట్లుగా అనేక కవితలు తమ అనుభవసారాన్ని గుప్పించారు.

ఒక దేశ భవిష్యత్తు ఎప్పుడూ ఆ దేశ యువతపైనే ఎక్కువ భాగం ఆధారపడి ఉంటుంది. ఏ దేశ యువత తప్పుడు ఆలోచనలతో, అనవసర ఆవేశాలతో, అసూయ ద్వేషాలతో భవిష్యత్తు వైపు అడుగులు వేస్తుందో, అప్పుడు ఆ దేశం చీకటిలోకి పయనించే ప్రమాదం ఉంది. ఈనాటి యువత అనేక విషయాల్లో పరిపక్వతతో ఆలోచించి అడుగులు వేయాలని చెబుతూ, ముఖ్యంగా తమ లక్ష్యాలను నిర్దేశించుకొని ఆ లక్ష్యం వైపు సాధించే దిశగా పయనించి విజయం సాధించి తమను కన్న వారికి, తాము ఉన్న ఊరికి పేరు తేవాలని చెబుతూ 'ప్రేమ నౌక' అనే కవితలో - ప్రేమ జీవితంలో ఒక భాగంగా మాత్రమే చూడాలని ఆ ప్రేమ కోసం జీవిత లక్ష్యాన్ని బలి పెట్ట రాదంటూ-

ప్రేమ ప్రేమ అంటూ విశృంఖల విధులపై పడుతున్న
యువకుల్లారా !
పిచ్చి ప్రేమలో పడి లక్ష్యాలను నీరుగారుస్తున్న
యువతుల్లారా !
ప్రేమంటే నమ్మకమనే సౌధానికి పునాది రాయి

అంటూ నమ్మకానికి మనిషికి మధ్య పెరుగుతున్న దూరం గురించి, యువతలో యవ్వనంలో కలిగేది ప్రేమనా! కామమా ! సరి చూసుకోమని హితవు చెబుతారు.

సహజంగానే ఈశ్వర రెడ్డి గారికి పల్లె పై మమకారం ఎక్కువగానే ఉన్నట్లు తెలుస్తుంది. ఆయన బహుశా గ్రామీణ వాతావరణంలో నుంచి ఎదిగిన కృషీవలురై ఉండవచ్చు. పల్లెలు ఒకప్పుడు ఎలా వుండేవి ఇప్పుడు ఎలా వున్నాయి? అలాగే పల్లెల్లో పండుగ అంటే ఆ వాతావరణంతో మనిషి మనసుకు ముడిపడి వున్న ఒక ఆత్మీయత, అలౌకికానుభూతి మనందరికీ గుర్తు చేస్తారు. పండుగలలో ముఖ్యమైన పండుగలు చాలా వున్నా అందులో మన మనసుకు ఇష్టమైన పండుగ సంక్రాంతి పండుగ. ఇది ప్రతి మనిషి పండుగ. ప్రతి పల్లె పండుగ. సంక్రాంతి ఒకరకంగా ప్రకృతికి మనిషికి మధ్య విడదీయ రాని బంధాన్ని పెనవేసుకొని ఉన్నట్లు అనిపిస్తుంది. ప్రతి ఏటా ప్రతి ఒక్కరికి సంక్రాంతి పండుగతో ఒక తీపి గుర్తు వుండే వుంటుంది అంటే అతిశయోక్తి కాదని చెప్పవచ్చు. 'పల్లె పండుగ' అనే కవితలో కవి తాను పూర్తిగా సంక్రాంతి పండుగలోకి పరకాయ ప్రవేశం చేసినట్లుగా ప్రతి అంశాన్ని సునిశితంగా అద్భుతంగా కవిత్వీకరించడం కనిపిస్తుంది.

సంక్రాంతి పండుగ
తెలుగు ఇంటి సంప్రదాయాలను
జాలువార్చే గీతిక
మా ఊరికి ఊపిరి పోసే వేడుక

అంటూ ఆపాత మధుర జ్ఞాపకాలకు ప్రతీకగా చక్కటి వర్ణనలతో మనకి పల్లె పండుగ సంక్రాంతిని దర్శింప చేస్తారు.

సంక్రాంతి అనగానే మన చుట్టూ వున్న గ్రామీణ ప్రపంచం ఎంత అద్భుతంగా మారుతుందో చూడండి

అంటూ ఇంటికి సున్నాలు వేయడం, ఇంటి ముందు రంగవల్లులతో, గొబ్బెమ్మలతో, పూలతో, అలంకరణలు. ఇంట్లో పిండివంటల ఘుమఘుమలతో, బంధువులతో, కొత్త బట్టలతో, ఇంటికి వచ్చిన ధాన్యరాశులతో రైతులు, శ్రామికులు, కర్షకులు వాళ్ల కష్టానికి దక్కిన ఫలితంతో సంతోషంగా ఉండే రోజులు ఈ సంక్రాంతి పండుగ రోజులు.

పాత వస్తువులతో వేసే భోగి మంటలు, ఇంటి ముంగిటకు వచ్చే గంగిరెద్దులు, హరిదాసులు, అలసిన మనసులకు జీవౌషధం పట్టించినట్టుగా ఒకప్పుడు ఈ పండుగ మనిషిని పునరుత్తేజితున్ని చేసేదని, కానీ నేడు పల్లెల్లో ఆ కళ పోయిందంటూ 'పల్లె పండుగ' కవితలో

"ఇప్పుడు నా పల్లె తలకిందులై పోయింది
అనాథ వృద్ధురాలిగా మారిపోయింది
నిత్యం కరువు కాటకాలతో సతసతమౌతూ

ఊరు ఒంటరైపోతోంది అని తన ఆవేదనను వ్యక్తపరుస్తారు. కరువు కాటకాలు, ప్రపంచీకరణ మాయా జాలం, ఆధునిక సాంకేతికత పేరుతో ముంచెత్తుతున్న వస్తు మాయలో పడి

పల్లె కలల్ని మింగేస్తున్నాయి
సంస్కృతిని ఛిద్రం చేస్తున్నాయ్
కొన ఊపిరితో కొట్టుకుంటున్న

మానవ సంబంధాల్ని తెంపేస్తున్నాయ్ అని నా ఊరును నాకు కాకుండా చేశరని హృదయవిదారకంగా ఘోషిస్తారు.

మనల్ని నడిపించేవి రెండే విషయాలని లోకంలో వినిపిస్తుంటుంది. అవే 'ఓటు, నోటు'. కవి ఈశ్వర రెడ్డి గారు 'ఓటు వజ్రాయుధం' అనే కవితలో "ఓటు ఒక వజ్రాయుధం, అది నీ చూపుడు కొనన ఒదిగిన బ్రహ్మాస్త్రం" దాన్ని సరైన విధంగా ప్రయోగిస్తే నీ జీవితం సురక్షితమనీ, సమాజం సుభిక్షంగా ఉంటుందని అంటారు. ఓటు కోసం నాయకులు మనల్ని ఎలా ప్రభావితం చేస్తారో నిశితంగా వివరిస్తారు. "క్రమశిక్షణ గల సైనికుడి లాంటి ప్రాణ త్యాగికి ఓటు వెయ్యాలి" అని బలంగా చెప్తారు. "అతి పెద్ద ప్రజాస్వామ్యం ప్రజల అభీష్టాలకు తావేలేని ప్రదేశం" అని 'ఓట్ల సంత' కవితలో నాయకులు స్వీయ లాభాల కోసం ఏ విధంగా ప్రజల భవిష్యత్తును చీకటి ఊబిలోకి తన్నేస్తున్నారో వివరిస్తారు.

నేటి మనిషి కన్నా స్వార్థజీవి ఈ ప్రపంచంలో మరొకటి లేదని గట్టిగానే కొన్ని సందర్భాలలో మనకు అనిపిస్తూ వుంటుంది. ఎందుకంటే ఈ సువిశాల ప్రపంచంలో మనిషి మాత్రమే తెలివైన జీవిగా సృష్టి మొత్తం తనకు మాత్రమే సొంతమైనదిగా డబ్బు మదంతో, అహం కారంతో, ఆధిపత్యంతో ప్రవరిస్తుంటాడు. మతాన్ని కూడా తన అవసరాలకు అనుగుణంగా వాడుకుంటాడు. రసాయనాలతో ప్రకృతిని, అమాయకంగా వున్న తన తోటి మనుషులను కిరాతకంగా మృత్యు ఒడిలోకి చేరుస్తాడు. ప్రకృతిని తన గుప్పిట్లో బంధించే సాహసం చేస్తూ వుంటాడు. అడవులను తెగనరికి, నదులను తనకు నచ్చినట్లుగా కుదించేసి, సముద్రాలను కట్టడి చేసే ప్రయత్నం చేస్తూ, భూమిని కుళ్ళబొరుస్తూ తన ఆధిపత్యపు విషపు కోరలకు అవధులు లేవన్నట్లు ప్రవర్తిస్తూ వుంటాడు. కానీ ప్రకృతి అప్పుడప్పుడు మనిషికి బుద్ధి చెబుతూనే వుంటుంది. గుణ పాఠాలు నేర్పుతూనే వుంటుంది. అయినా మనిషి మళ్లీ మళ్లీ ప్రకృతిని జయించాలనే మీమాంసలో తప్పు మీద తప్పు చేస్తూనే వున్నాడు. ప్రకృతితో చెలగాటమాడుతూ వున్నాడు.

ఒకప్పుడు భూమి కొనడం అమ్మడం ఆశ్చర్యపరిస్తే, తర్వాత కాలంలో నీళ్లు కొనడం అమ్మడం మామూలైపోతే, నేడు గాలిని(ఆక్సిజన్) కొనడం కూడా గగనమైపోయింది. దీనికి మూల కారకులు ఎవరు?మనిషి ఆధునిక సాంకేతి కత వైపే కాదు, పతనం వైపు కూడా పరుగులు తీస్తున్నా డేమో అనిపిస్తుంది.

## 'అమానవీయ శాస్త్రం' కవితలో..

ఇప్పుడు మనిషి చాలా ఎదిగిపోయాడు

ఒక్క క్షణంలో తన జాతి సమస్తాన్ని
పిడికెడు రసాయనాలతో
సులభంగా చంపేస్తున్నాడు

అంటూ తీవ్రంగా హింసాకాండను ఖండిస్తారు.

కోటి విద్యలు కూటి కోసం అన్నట్లు నేడు సగటు మనిషి బతుకు అందునా దినసరి కూలీతో దినదిన గండంగా బతుకుతున్న బతుకుల గురించి, చదువులు ఎన్ని చదివినా, చదివిన చదువుకు చేసే పనికి తీసుకొనే జీతానికి ఎక్కడ పోలిక సరిపోక, బరువెక్కిన ఆలోచనల పరంపరలతో గుదిబండలాంటి జీవితాన్ని మోస్తూనే తమ బతుకు జీవనం సాగిస్తున్న వారెందరో అంటూ అలాంటి వారి దయనీయ బతుకు చిత్రాల స్పృహతో 'దినసరి బతుకు' కవిత రాశారు.

బతుకు తెరువు కరువై
దిగులు కీలలు దహిస్తుంటే
దినసరి ఉద్యోగ ఊబిలో పడ్డ జీవితం నాది.
చేసే చాకిరీకి
పుచ్చుకునే కూలీకి
పొంతన ఏ కోణాన కనిపించదు

అంటూ సాగే కవితలో నేడు సమాజంలో కనిపిస్తున్న సాదాసీదా ఉద్యోగుల, ఒప్పంద ఉద్యోగుల, కూలీల వెతలు నరకయాతనలు కనిపిస్తాయి.

చాలా వరకు ఈశ్వర రెడ్డి గారి కవిత్వం అంతా సమాజ స్థితిగతులకు అద్దం పట్టే విధంగా భిన్న పార్శ్వాలతో స్పందించి, సమాజ పరివర్తననే లక్ష్యంగా కవిత్వీకరించి నట్లుగా వారి కవితలు కనిపిస్తాయి. ఎక్కువగా ప్రస్తుతం మనుషులు ఎదుర్కొంటున్న వివిధ రకాల సమస్యలపై సమరశంకం పూరించినవే వీరి కవితలు.

పల్లె బతుకు చిత్రం, రాయలసీమ కరువు కష్టం, రైతుల, శ్రామికుల, కర్షకుల, నిరుద్యోగుల అగచాట్లు, సామాన్య మధ్యతరగతి మనోభావాలు, నోటు రాజకీయాలు, మాయా వాగ్దానాలు, కళ తప్పిన పండుగలు, మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు, మనుషుల్లో పెరిగిపోతున్న అమానవీయ కోణం, ఆధునిక సాంకేతికతలో భాగంగా మనిషికి మనిషికి పెరుగుతున్న దూరం ఇలా ఎన్నో సమస్యల గుట్టలా ఈ కవితా సంపుటి సాగుతుంది.

చివరగా ఈ కవితా సంపుటి పేరు 'నాకొక మనిషి కావాలి' కవితలోకి వెళితే ఆయన ఎందుకు ఒక మనిషి కావాలి అంటున్నాడు? చుట్టూ ఇంతమంది ఉన్నా నాకు ఒక మనిషి కావాలి అని కవి ఎందుకు అంటున్నారు అనే ప్రశ్న ఉదయించవచ్చు. కానీ ఆయన కోరుకునే మనిషి ఈ లోకంలో తారసపడడం కష్టమే. ఎందుకంటే సమకాలీన సమస్యలకు అతీతంగా వాటిని జయించి ధర్మబద్ధంగా జీవించగలిగే ఉత్తమ మానవుడు, స్పష్టంగా చెప్పాలంటే కామ క్రోధ మద మాత్సర్యాదులకు అతీతంగా, నిలువెల్లా మానవీయతను పుణికిపుచ్చుకున్న మహానుభావుడు, నిష్కల్మషమైన సహృదయ స్నేహశీలి కనిపిస్తే నిజంగా అలాంటి మనిషి నాకు కావాలి అన్పిస్తుంది.

'నాకొక మనిషి కావాలి' కవితలో
నాకొక మనిషి కావాలి
అరమరికలు లేని మనసుతో
నిర్మలంగా ప్రవహించే మనిషి కావాలి ...
రూపాయి ముఖాన్ని తొడుక్కొని
మనిషి విలువలను సున్నా చేసిన
అంగడి బేరపు ఆధునిక మస్తిష్కాల్ని
వామ పాదంతో తన్నగల మనిషి కావాలి ...
విశాల మానవ విశ్వంలో
బాధల మూలుగు ఏ మూల నుండి వినపడ్డా
నేనున్నానని గుండెకు హత్తుకునే మనిషి కావాలి...
మనిషిని మనిషిగా బతకనివ్వని
ఈ యాంత్రిక కుతంత్ర సమాజాన్ని
మానవీకరించగల మనిషి కావాలి...
మానవతకు అమరత్వం ఇవ్వగల
మామూలు మనిషి కావాలి.

అంటూ సాగిన ఈ కవిత్వం నిజంగా ఈశ్వర రెడ్డి గారి మనసు పొరల్లో దాగి వున్న మానవీయ కోణానికి నిదర్శనంగా, ఆయన వ్యక్తిత్వానికి ప్రతీకగా నిలుస్తుంది. ఇక కవి తనను తాను తెలుసుకున్న తత్వజ్ఞానిగా, తనను తాను మలుచుకున్న అక్షర తపస్విగా అనిపిస్తారు. ఈ కవితా సంపుటిని వారి అమ్మ గారికి అంకితం ఇవ్వడంతో కవి ఒక బిడ్డగానేగాక, ఉన్నత వ్యక్తిత్వం గల మనిషిగా మరో మెట్టు ఎదిగారని చెప్పవచ్చు.